కవితా కౌముది

# నా నీవు

శిరీష జైస్వాల్

౧. చల్లని గాలిలో తడిసినా
తపన తలుపులన్ని
నక్షత్ర బిందువులై నా హృది కుంచె
నీ రూపే మలిచింది

౨. సంద్రాన్ని అంతా మింగే
మీనాలే ఆ నయనాలు
చూపుల వర్షంలో తడిసే
సీతాకోకచిలుకే
నీ.. నేను

౩. నీ అధరాలకి అంటిన
చిరునవ్వుల మెరుపులు
అప్పుడప్పుడు గర్జిస్తాయి కూడా

౪. జనారణ్యానికి ఆప్యాయతను
అరువుగా ఇచ్చిన
తరగని మంచుపూల మమతే
నీ హృది

౫. శ్రావణ శశివై
హృదయాకాశంలో
నిలిచిపోయే
మైత్రే నీవు.... కదా!!

౬. కాలలు మూడు ,
ఋతువులు ఆరు ఉండేవి
ఒకప్పుడు,
నీ ప్రేమ వసంతం తప్ప
ఇంకే సంవత్సరాలు మిగలలేదు నాకు..

★★★

# మధ్య తరగతి పవన్ కుమార్ గజవల్లి

రిక్షా ఎక్కనూ లేరు, దాన్ని తొక్కనూ లేరు
గంభీరంగా నడిచి వెళ్తారు
అడిగితే, ఆరోగ్యానికి మంచిదంటారు
అబద్ధం లో కూడా గౌరవాన్ని కోరుకుంటారు !
గోడ మీద పిల్లులు, అనుమానాల పక్షులు
బావిలో కప్పలు, ఎప్పుడూ తిప్పలు
అతి జాగరూకులు, ఆచితూచి అడుగులు
కిర్రు మనే కుర్చీలు, మాసిన మరచెంబులు
తలకు తగిలే దండేలు, గోడనిండా పటాలు
పట్టెమంచపు చప్పుళ్ళు, చిలుము పట్టిన ట్రంకుపెట్టెలు
వారసత్వపు రోలురోకలి, పాత ఇనుప పప్పు కుంపటి
రంగు వెలిసిన విసనకర్రలు, బూజు పట్టిన బీరువాలు
కట్ కట్ మని తిరిగే పాత కాలం ఫానులు
టిక్కు టిక్కు మంటుండే పెద్ద గోడ గడియారం
తరతరాల ఆస్తులు, విలువలేని గురుతులు !!
స్నానాల గదిలో నాని వుండే సబ్బు, నీళ్ళుకలిపిన షాంపూ
మసక బారిన అద్దం, దానిపై అంటించిన బొట్టు బిళ్ళలు
పళ్ళూడిన దువ్వెనలు, గోడకంటిన బొట్టు కాటుకలు
ఎపుడూ నీళ్ళు కారే కుళాయిలు, చిమ్మ చీకటి స్నానాల గది
కుర్చీల మీద టవళ్ళు, తలుపుల మీద బట్టలు
గూళ్ళలో మడతపెట్టి పరిచిన న్యూస్ పేపర్
దానిపై వస్తువులు, దాని కింద చిల్లర డబ్బులు
పాత బనియన్ మసి గుడ్డలు, సొట్టబోయిన కంచాలు
సగం విరిగిన పప్పు గుత్తి, మూత విరిగిన జాడీలు
రంగు మారిన రైసు కుక్కరు, అడుగు మాడిన పాల గిన్నెలు!
గోడలకు వేళ్ళాడే పచ్చరంగు బల్బులు
పొమ్మన్నా పోని చీమలు, బంధువుల్లాంటి బొద్దింకలు

దైవ భీతి నిండు, పాప భీతి మెండు
జాతకాల జాతర, ముహూర్తాల ముచ్చట
గుళ్ళ చుట్టూ నడకలు, లెక్క లేని ముడుపులు
గడి గడి కి వ్రతాలు, తీర్చలేక కష్టాలు
మోయలేని మొక్కులు, మాయలేని బతుకులు
వసతికేమో చిన్నోళ్ళు, ప్రేమకేమో పెద్దోళ్ళు
ఆరోగ్య సూత్రాలు, చిట్కా వైద్యాలు
జానెడేసి జీతాలు, బారెడేసి స్వప్నాలు
లోపలేమో చిరుగులు, పైనేమో మెరుగులు
పండగొస్తే కష్టాలు, తీర్చలేని వరాలు
తరచుగా చుట్టాలు, మోయ లేని భారాలు
ఇంట్లో నక్కువామికాలు, బయట మాత్రం పల్సటిల్లాలు!
ఖర్చుకష్టమెదురైనా కాఫీ టీ లను వదలరు
ఇస్త్రీ బట్టకు తగ్గరు, గిల్టు నగలను ముట్టరు
ఒక్క సంపాదనే మర్యాద, అందరూ పనిచేయటం నామోషి!!
మధ్య తరగతి ఒక మౌన రాగం, అదొక నిశ్శబ్ద శబ్దం
అధిక భాగం మంద్రస్థాయి, మధ్యమావతి ఆది తాళం
తరచుగా తోడి రాగం, అపుడపుడూ మోహనం
జన్మ రాహువు, ఏలినాటి శని
సహజంగా మధ్యతరగతి, ఒక తాటాకు చప్పుడు
తడిసి పేలని టపాసు, ఆగి వెలిగే మతాబు!!
ఏమైనా
మధ్య తరగతి ఒక నిండు సింగిడి
ఉగాది పచ్చడి, సంతోషాల సందడి
అనురాగాల పల్లవి, ప్రేమైక వల్లరి
అంతులేని కథ, ఒక సరదా స్రవంతి.

★★★

## రసహంస
### డా.బాలాజీ దీక్షితులు పి.వి

నీ
నవ్వుల పరికిణి లో
మువ్వల మురిపంతో
జివ్వు మంటుంది నా మనసు...చల్లగా

నీ
వెన్నెల సిరి ఉప్పెనై
కన్నె సోయగం తుఫానై
ఊపిరి నులిమేస్తుంది...తీయగా

నీ
వలపు చుక్కల వర్షం
తలపు మధుశిత సుగంధం
ఉరిమి మరీ బంధించేసాయి...అదో మైకంగా

నీవు
కవన మాధురీ మధురిమవు
ప్రణయ ప్రవల్లికా ప్రణీతవు
రసచందన రమణికవు
నేను
నీ కోసమే పరితపించు
హంసను...పరమ రసహంసను

***

## పేదోడి ప్రశ్న
### జెట్టబోయిన శ్రీకాంత్

ఆకలి అంటే ఏమిటో
నూకలి గింజనడుగుతా..!
ఈ ఆకలి ఎందుకవుతదో, మాడుతున్న
కడుపునడుగుతా..!
గూడు అంటే ఏమిటో
గుడిసెలున్న అవ్వనడుగుతా...!
తోడు అంటే ఏమిటో
నా మనసులోని మనిషినడుగుతా...!
కష్టము అంటే ఏమిటో
నా ఒంటిమీది చెమటనడుగుతా...!
దురదృష్టము అంటే ఏమిటో
నా కంటి లోని నీటినడుగుతా...!
కోపము అంటే ఏమిటో
నాకు జీతమిచ్చే దొరని అడుగుతా...!
శాపము అంటే ఏమిటో
నా నుదిటనున్న రాతనడుగుతా...!
కరువు అంటే ఏమిటో
ఎండిపోయిన చెరువునడుగుతా...!
పరువు అంటే ఏమిటో
ఊగులాడే ఉరితాడునడుగుతా...!
పేదోడు అంటే ఎవ్వడో
ఆ తాటాకుల తడకను అడుగుతా..!
ఉన్నోడు అంటే ఎవ్వడో
ఆ గంధపు చెక్కల గడపను అడుగుతా...!

★★★

# రసరేఖలు

**శ్రీధర్ బచ్చోటి**

ఈ మధురయామినీస్ఫురదిందుకాంతి
ఈ చకోరమృదులమాధురీరవమ్ము
ఈ మనోజ్ఞ తమాలపరిమళమ్ము
అలదుచున్నవి శోభనీ యామవతికి

వనము గొంతు విప్పక పల్కు పలుకులివ్వి
నవ్యసుమబాలికల చిరునవ్వులివ్వి
కనులకామెత గూర్చెడు కౌముది యిది
తలపుకందని రజని సౌందర్యమిద్ది

ఎంత సౌందర్యమయమైనదీ వెలుంగు
ఎంత యానందమయమైనదీ క్షణమ్ము
ఇచటి వెన్నెల నడచితిమెన్ని సార్లు
అమితపారవశ్యదమీ రసానుభూతి

పిల్లతెమ్మెరలెద సొమ్మసిల్లజేయు
దారి ప్రక్కల సుమములు తలలనూచు
ప్రకృతియెల్లనీ క్షణమందు రాగమయము
కలసి పోవుదమీ త్రోవ కలలు పండ

వలపు పాటలనిచ్చటే పాడుకొనగ
కాలమంతయునిచ్చటే కరగిపోవ
చెలియ యికనేమి వలయునీ జీవితమున
ధన్యమైనవి మన జీవితములు రెండు

COMMENTS